సాక్షి అనంతపురం

బుధవారం । 19 । జూలై । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.106

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.106 పలికింది. కనిష్టం రూ.60, సరాసరి రూ.80 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.2°/23.5°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం బాగా పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు బుధవారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు స్థాయీ సంఘం–1, 3, 7(ఫైనాన్స్, ప్లానింగ్/ వ్యవసాయ/ ఇంజినీరింగ్ శాఖల) సమావేశాలు ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం 2 నుంచి స్థాయీ సంఘాలు–2, 4, 5, 6 (గ్రామీణాభివృద్ధి/ విద్య, వైద్య ఆరోగ్య/ సాంఘిక సంక్షేమం/ స్త్రీ, శిశు సంక్షేమ శాఖలు) సమావేశాలు నిర్వహించనున్నారు. ఆయా స్థాయీ సంఘాల చైర్మన్ల అధ్యక్షతన సమావేశాలు జరుగుతాయి.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో ఎస్పీ శ్రీనివాసరావు


అనంతపురం అర్బన్: మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నివారణపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ శ్రీనివాసరావు, డీఎఫ్‌ఓ సందీప్ కృపాకర్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోకి మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాలు రవాణా కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలని చెప్పారు. అవగాహన కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా నగర, పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో మరిన్ని హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల పంటలు సాగు చేస్తున్నట్లు గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా గంజాయి సాగు చేస్తుంటే సమాచారం ఇవ్వాలన్నారు. మాదక ద్రవ్యాలు వాడుతున్నా, డి–అడిక్షన్ కేంద్రానికి వెళ్లాలన్నా 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని చెప్పారు.

బీ–ఫార్మసీ ఫలితాల విడుదల



అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలోని బీ–ఫార్మసీ మొదటి సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–19) రెగ్యులర్, ఫార్మా–డీ నాలుగు, ఐదో సంవత్సరం సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు, ప్రీ–పీహెచ్‌డీ (2021 అడ్మిట్ అయిన బ్యాచ్) ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఫలితాలను http://jntuaresults.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో 35 గొర్రె పిల్లలు మృతి



గార్లదిన్నె: ఒకట్రెండు కాదు... ఏకంగా 35 గొర్రెపిల్లలు కుక్కల దాడిలో మృతి చెందాయి. స్థానికులు తెలిపిన మేరకు... జంబులదిన్నెకు చెందిన గొటుకూరు రామాంజనేయులు గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం 35 గొర్రె పిల్లలను గూడు కింద వదిలి, తనకున్న 300 గొర్రెలను మేపునకు తోలుకెళ్లాడు. సాయంత్రం గూడు వద్దకు చేరుకుని చూడగా 35 గొర్రె పిల్లలూ మృతి చెంది ఉన్నాయి. వీధి కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి చెందినట్లు అక్కడి అడుగు జాడలు స్పష్టం చేశాయి. ఈ ఘటనతో దాదాపు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు కాపరి వాపోయాడు.

స్వయం ఉపాధికి తోడు

- జిల్లాలో 24,132 మందికి 'జగనన్న తోడు'
- ఒక్కొక్కరికి రూ.10 వేల వడ్డీలేని రుణం
- రూ.26.61 కోట్ల మెగా చెక్కు విడుదల
- రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించండి
- ఎంపీ, ఎమ్మెల్సీ, కలెక్టర్ పిలుపు



'జగనన్న తోడు' రుణాల మెగా చెక్కు విడుదల చేస్తున్న ఎంపీ రంగయ్య, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి తదితరులు

అనంతపురం అర్బన్: చిరు వ్యాపారుల స్వయం ఉపాధికి 'జగనన్న తోడు' ఎంతగానో ఉపయోగపడుతోంది. వ్యాపారాభివృద్ధికి అవసరమైన పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న తోడు' పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద చిరువ్యాపారులు, సంప్రదాయ వృత్తిదారులకు ఏటా రూ.10 వేల వడ్డీ రుణం అందిస్తోంది. మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వరుసగా నాలుగో ఏడాది 'జగనన్న తోడు' రుణాలను కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి పాల్గొని లబ్ధిదారులకు మంజూరైన రుణం, సున్నావడ్డీ మొత్తానికి సంబంధించి రూ.26,61,96,000 మెగా చెక్కును విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. చిరువ్యాపారులు, సంప్రదాయ వృత్తిదారులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడకుండా ప్రభుత్వం 'జగనన్న తోడు' పథకం ద్వారా సున్నావడ్డీతో రుణ సదుపాయం కల్పిస్తోందన్నారు. పథకం కింద చిరువ్యాపారులు, సంప్రదాయ వృత్తిదారులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రుణం సదుపాయం కల్పిస్తున్నారన్నారు. జిల్లాలో 24,132 మంది లబ్ధిదారులకు రూ.25,98,90,000 బ్యాంక్ రుణాన్ని వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. గతంలో రుణం పొంది సకాలంలో చెల్లించిన 29,159 మందికి సున్నా వడ్డీ కింద రూ.63,06,000 వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. లబ్ధిదారులు రుణ మొత్తాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు నరసింహారెడ్డి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి రుణం



డిగ్రీ చదివిన నేను 'జగనన్న తోడు' పథకం ద్వారా రుణం పొందాను. ఆ మొత్తంతో వ్యాపారం చేసుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్నా. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చల్లగా ఉండాలి. లబ్ధిదారులందరూ జగనన్న తోడు రుణాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– నర్మద, హౌసింగ్‌బోర్డు, అనంతపురం

గౌరవంగా జీవిస్తున్నాం



మాది చాలా పేద కుటుంబం. జగనన్న తోడు పథకం కింద అందిన రూ.10వేల రుణంతో గాజుల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ గౌరవంగా జీవిస్తున్నాం. మాకిచ్చిన రుణంపై వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తూ సహకారం అందిస్తోంది. ఇంత చేస్తున్న ముఖ్యమంత్రి మేలు ఎన్నటికీ మరచిపోలేము.

– గౌసియా, రాప్తాడు

21 మండలాల్లో తేలికపాటి వర్షం

- రెండు రోజుల్లో అల్పపీడనం



అనంతపురం అగ్రికల్చర్: నైరుతి రుతుపవనాలు పెద్దగా ప్రభావం చూపకపోవడంతో ఇప్పటి వరకు తేలికపాటి వర్షాలకే పరిమితమవుతోంది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు 21 మండలాల పరిధిలో 3.4 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. శింగనమల 18.2, యల్లనూరు 12.6 మి.మీతో పాటు వజ్రకరూరు, పుట్లూరు, పామిడి, విడపనకల్లు, నార్పల, గార్లదిన్నె, బెళుగుప్ప, బుక్కరాయసముద్రం, కంబదూరు, బొమ్మనహాళ్, ఉరవకొండ, కళ్యాణదుర్గం, పెద్దవడుగూరు, గుమ్మఘట్ట తదితర మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. చాలా ప్రాంతాల్లో 20 నుంచి 25 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తుండటంతో మేఘాలు చెదిరిపోతున్నాయి. దీంతో చాలా ప్రాంతాల్లో గాలిచినుకులకే పరిమితమవుతున్నాయి. కాగా ప్రస్తుతం రుతుపవన ద్రోణి ఉండగా మరో రెండు రోజుల్లో వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అశోక్‌కుమార్ వాతావరణ బులెటిన్‌లో తెలిపారు. దీని ప్రభావంతో రాగల మూడు రోజుల్లో తేలికపాటి వర్షపాతం నమోదు కావచ్చన్నారు. కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం పడవచ్చని తెలిపారు.

చిరుధాన్యాల సాగు పెరగాలి




వ్యవసాయ, అనుబంధ శాఖలపై సమీక్షిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అగ్రికల్చర్: వర్షాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో చిరుధాన్యాల పంటల సాగుకు అవకాశం ఉందని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలో భాగంగా స్వల్పకాలిక చిరుధాన్యపు పంటల సాగు విస్తీర్ణం పెంపుపై ప్రత్యేకదృష్టి సారించాలని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వ్యవసాయ, అనబంధ శాఖల అధికారులతో జేసీ సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా వర్షాభావంతో ఖరీఫ్‌లో ముఖ్యమైన వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, మొక్కజొన్న తదితర పంటల సాగు మందకొడిగా ఉన్నందున... కాస్త ఆలస్యంగా వచ్చే వర్షాలను ఉపయోగించుకుని చిరుధాన్యపు పంటల సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తే 'మిల్లెట్ ఇయర్'కు సార్థకత చేకూరుతుందన్నారు. పండించిన రాగి, సజ్జ, కొర్ర, జొన్న తదితర చిరుధాన్యపు పంట ఉత్పత్తులను ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఆర్‌బీకే వారీగా ప్రత్యామ్నాయ విత్తన, పంటల ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. కౌలుదారులను గుర్తించి సాధ్యమైనంత ఎక్కువగా సీసీఆర్‌సీ కార్డులు అందించి ప్రభుత్వ ప్రయోజనాలు కల్పించాలన్నారు. కిసాన్‌డ్రోన్లకు సంబంధించి ఇప్పటికే 12 మందికి శిక్షణ ఇచ్చారని, మరో 8 మందికి కూడా శిక్షణ ఇవ్వాలన్నారు. వారి ద్వారా రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆర్‌బీకే శాశ్వత భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆర్‌బీకేల్లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతరత్రా ఇన్‌పుట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. పట్టు, పశుసంవర్ధక, ఉద్యాన, ఏపీఎంఐపీ, మత్స్యశాఖ, ఏపీ సీడ్స్, మార్కెటింగ్, సహకారశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాల పురోగతి గురించి ఆరాతీశారు. సమీక్షలో ఆయాశాఖ జిల్లా అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి నాయకత్వం వహించాలి

- హెచ్‌ఎంలకు ప్రాథమిక విద్య ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి సూచన



మాట్లాడుతున్న ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డి



హాజరైన ప్రధానోపాధ్యాయులు

రాప్తాడురూరల్: విద్యార్థులతో పాటు పాఠశాల అభివృద్ధి చెందాలంటే సంబంధిత ప్రధానోపాధ్యాయులు నాయకత్వం వహించాలని పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ ఉప సంచాలకులు (ఆర్జేడీ) వెంకట కృష్ణారెడ్డి సూచించారు. లీడర్ షిప్ అంశంపై ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు ఆరు రోజుల రీజనల్ స్థాయి శిక్షణ మంగళవారం అనంతపురంలో ప్రారంభమైంది. అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి ఎంపిక చేసిన 200 మంది ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డి హాజరై.. శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేందుకు వీలుగా మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలు బడి, జూనియర్ కళాశాలల్లోనే ఉండేలా చర్యలు తీసుకుందన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రతి తరగతి గదిలోనూ ఐఎఫ్‌పీలు, స్మార్ట్‌టీవీలు ఏర్పాటు చేసి డిజిటల్ బోధన అందిస్తోందన్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు అవసరమైన పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. విద్యావ్యవస్థ మరింత బలోపేతం కావాలంటే హెచ్‌ఎంలు... ఉపాధ్యాయులను, విద్యార్థులను, తల్లిదండ్రులను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. గుణాత్మక విద్య, వినూత్న బోధన, ఆలోచనలకు నాంది పలికేలా ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం విద్యా అగ్రగామి సంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (అహ్మదాబాద్)తో అవగాహన ఒప్పందం చేసుకుందన్నారు. ఎంపిక చేసిన ప్రధానోపాధ్యాయులకు వ్యూహాత్మక నిర్ణయాలు, నాయకత్వ లక్షణాలు, స్కూల్ ప్రిన్సిపాల్ పాత్ర, పాఠశాల వాతావరణంలో అభ్యసన సంసిద్ధత, క్రమశిక్షణ, పునరుద్ధరణ, ఆసక్తికరమైన వినూత్న బోధన, కొత్త ఆలోచనలను ప్రోత్సహించడం తదితర అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. సమావేశంలో రాష్ట్ర పరిశీలకులు నితిన్, అనంతపురం డీఈఓ సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు ముందస్తు 'మద్దతు'

- వేరుశనగకు మద్దతు ధర క్వింటాల్‌కు రూ.6,377 ఖరారు
- వరి రూ.2,203, కంది రూ.7 వేలు, పత్తికి రూ.7,020
- వేరుశనగ, పత్తి, పెసరకు గతేడాది కన్నా పెరిగిన ధర
- ఎంఎస్‌పీ కన్నా మార్కెట్‌లో ధర తక్కువైతే కొనుగోళ్లు



గతేడాది, ఈ ఏడాది పంటల వారీగా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) రూపాయల్లో

పంట	2022 సంవత్సరం	2023 సంవత్సరం	పెరిగిన ధర (రూ.)
వరి(సాధారణం)	2,040	2,180	143
వరి (ఏ-గ్రేడు)	2,060	2,203	143
వేరుశనగ	5,850	6,377	527
కందులు	6,600	7 వేలు	400
పత్తి (మీడియం)	6,080	6,620	540
పత్తి (పొడవు రకం)	6,380	7,020	640
మొక్కజొన్న	1,962	2,090	128
జొన్న (మాల్దండి)	2,990	3,225	235
జొన్న (హైబ్రీడ్)	2,970	3,180	210
సజ్జలు	2,350	2,500	150
రాగులు	3,578	3,846	268
పెసలు	7,755	8,558	803
మినుములు	6,600	6,950	350
నువ్వులు	7,830	8,635	805
నైగర్‌సీడ్ (ఒడిసెలు)	7,257	7,734	447
పొద్దుతిరుగుడు	6,400	6,760	360
సోయాబీన్	4,300	4,600	300

అనంతపురం అగ్రికల్చర్: రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం పంటలకు ముందస్తుగానే మద్దతు ధరలు ప్రకటించింది. దీని వల్ల ఏ పంట వేసుకుంటే గిట్టుబాటు అవుతుందో రైతు ఒక అంచనాకు వస్తారు. పంటల వారీగా పెడుతున్న పెట్టుబడులు, వస్తున్న దిగుబడులు, మార్కెట్‌లో పలుకుతున్న ధరలు, రైతులకు లభిస్తున్న నికరాదాయం ... తదితర అన్ని లెక్కలూ పరిగణనలోకి తీసుకుని జగన్ సర్కారు నాలుగేళ్లుగా ముందస్తుగానే కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. అంతకుమునుపు పంట చేతికొచ్చే సమయం లేదా సెప్టెంబర్, అక్టోబర్‌లో చాలా ఆలస్యంగా ఎంఎస్‌పీ ప్రకటించే పరిస్థితి ఉండేది. దీని వల్ల రైతులకు ఏ విధమైన ప్రయోజనమూ ఉండేది కాదు.


15 పంటలకు ఎంఎస్‌పీ..

ఖరీఫ్–2023లో 15 పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటించారు. అందులో ఉమ్మడి జిల్లాకు సంబంధించి ప్రధానంగా తీసుకుంటే వేరుశనగ, కందులు, మొక్కజొన్న, పత్తి లాంటి ముఖ్యమైనవి. వేరుశనగ విషయానికి వస్తే గతేడాది కన్నా క్వింటాలుపై రూ.527 పెంచడం విశేషం. అలాగే పత్తికి రూ.540, కందులకు రూ.400, మొక్కజొన్నకు రూ.128, వరిధాన్యంపై రూ.143, అత్యధికంగా నువ్వులపై రూ.805, పెసలుపై రూ.803 ప్రకారం పెంచారు. సజ్జలు, రాగులు, జొన్నల మీద కూడా రూ.150 నుంచి రూ.250 పెంచి ఇవ్వడం విశేషం. 2014–18 మధ్యకాలంలో క్వింటాలుపై ఒక్కసారి కూడా రూ.200 మించి పెంచిన దాఖలాలు లేవు.

ఎంఎస్‌పీ లేకుంటే కొనుగోళ్లు..

పంట చేతికొచ్చిన సమయంలో బహిరంగ మార్కెట్‌లో కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కన్నా తక్కువగా ఉంటే... వరి, వేరుశనగ, కంది, పప్పుశనగ, మొక్కజొన్న, కొర్రలు, రాగులు, సజ్జలు, పత్తి తదితర పంట ఉత్పత్తులను ఆర్‌బీకే వేదికగా కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఆదేశాలు ఇస్తోంది. వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ సహకారంతో పౌరసరఫరాల శాఖ, మార్క్‌ఫెడ్, నాఫెడ్, ఏపీ సీడ్స్, ఆయిల్‌ఫెడ్, కాటన్‌కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన నోడల్ ఏజెన్సీల ద్వారా కొనుగోళ్లు చేసి సొమ్మును సకాలంలో రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నారు. అలాగే ధరల స్థిరీకరణ నిధి, మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద కూడా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుండటంతో రైతులకు ప్రయోజనం కలుగుతోంది. పండిన పంట ఉత్పత్తులను ఎంఎస్‌పీ కన్నా తక్కువకు ఎలాంటి పరిస్థితుల్లోనూ అమ్ముకోవద్దని వ్యవసాయశాఖ జిల్లా అధికారి యు.ఉమామహేశ్వరమ్మ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి తెలిపారు.

మద్దతు ధరతో మొక్కజొన్న విక్రయం



బహిరంగ మార్కెట్‌లో ఈ ఏడాది మొక్కజొన్నకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు రైతులకు ఉపయోగపడ్డాయి. ఇటీవల నేను పండించిన 92 క్వింటాళ్లు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో అమ్మాను. నెల రోజుల్లోపు నా బ్యాంకు ఖాతాలో రూ.1,81,485 జమ అయింది. కచ్చితమైన తూకాలు, సకాలంలో డబ్బు ఇస్తుండటం వల్ల కొనుగోలు కేంద్రాల వల్ల రైతులకు ప్రయోజనం ఉంటుంది.

– వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి, వేములపాడు

స్టాఫ్ నర్సుల నియామకానికి వేళాయె

- 313 పోస్టుల భర్తీకి చర్యలు

కడప రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రభుత్వాస్పత్రుల్లో సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా స్టాఫ్‌నర్సుల నియామకాలను చేపడుతోంది. జోన్–4 (రాయలసీమ జిల్లాలు) పరిధిలో ఇప్పటికే కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల నియామకాలు భారీగా జరిగాయి. మరోమారు అధిక సంఖ్యలో జరగనున్నాయి.

మొత్తం 11,120 దరఖాస్తులు

ఈ ఏడాది ప్రారంభం నుంచే ప్రభుత్వం పెద్దసంఖ్యలో స్టాఫ్ నర్సు నియామకాలను చేపట్టింది. ఇందుకు సంబంధించి అభ్యర్థుల నుంచి మొత్తం 11,120 దరఖాస్తులు వచ్చాయి. ఏప్రిల్ వరకు మొత్తం 286 మంది అర్హులకు స్టాఫ్ నర్సులుగా ఉద్యోగాలిచ్చింది.

తాజాగా 313 నియామకాలు

ప్రభుత్వం మరోమారు స్టాఫ్‌నర్సు నియామకాలను చేపడుతోంది. ఇప్పటికే వచ్చిన 11,120 దరఖాస్తుల నుంచి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి.. రాయలసీమలోని 8 జిల్లాల్లో గల ప్రభుత్వ ఆసుపత్రుల్లో మొత్తం 313 మంది స్టాఫ్‌నర్సులను నియమించనున్నారు. మెడికల్ అండ్ హెల్త్ రీజనల్ డైరెక్టర్ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు) పరిధిలో 90, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆధ్వర్యంలో నంద్యాల మెడికల్ కాలేజీ, తిరుపతి మెటర్నిటీ ఆసుపత్రికి సంబంధించి 149, ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్‌లో 74.. మొత్తం 313 నియామకాలను చేపడుతున్నారు.

నిబంధనల ప్రకారం నియామకాలు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ నెల 21, 22 తేదీల్లో కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సు నియామకాలు చేపడుతున్నాం. ఇందుకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియను కడప వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాలులో నిర్వహిస్తాం.

– కేవీఎస్ అనిల్‌కుమార్, రీజినల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ

క్లుప్తంగా

జిల్లాకు చేరిన 1,433 మెట్రిక్ టన్నుల యూరియా



ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ రవి

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ఎరువుల ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు జిల్లాకు మంగళవారం 1433.80 మెట్రిక్ టన్నుల యూరియా చేరింది. ఈ మేరకు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌కు వ్యాగన్ల ద్వారా చేరిన యూరియా బస్తాలను రాప్తాడు ఏఓ వెంకటేశ్వర ప్రసాద్‌తో కలసి ఆయన పరిశీలించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఏఓ ఆదేశాల మేరకు తొలి ప్రాధాన్యతగా ఆర్‌బీకేలు, సహకార సంఘాలకు అందజేసి, మిగిలినవి హోల్‌సేల్, ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

రెండు జింకలు స్వాధీనం



ఫారెస్ట్ సిబ్బందికి జింకని అందజేస్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో స్థానికులకు పట్టుబడిన రెండు జింకలను ఫారెస్ట్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం వర్షం కురుస్తున్న సమయంలో దిగువ తండాలో ఓ జింక పిల్ల, నుసికొట్టాలలో మరో జింక కుక్కల దాడికి గురై గాయపడ్డాయి. గుర్తించిన స్థానికులు వాటిని తీసుకెళ్లి కళ్యాణదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ సుధాకర్ ద్వారా అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. ఎలాంటి హాని తలపెట్టకుండా వణ్య ప్రాణులను అందజేసిన స్థానికులను అటవీ శాఖ సిబ్బంది అభినందించారు.

వసతి గృహాలు ఫుల్

- ఏటా గణనీయంగా పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య
- నాణ్యమైన భోజనం, మెరుగైన సౌకర్యాలతో ఆకర్షితులవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- కార్పొరేట్ తరహాలో సౌకర్యాలు కల్పించిన జగన్ సర్కార్



ఇది అనంతపురం నగరంలోని ఎస్సీ బాలికల-2 వసతి గృహం. ఇక్కడ 260 మంది విద్యార్థులకు మాత్రమే వసతి కల్పించేందుకు అవకాశముంది. అయితే ఇప్పటికే సీట్లన్నీ భర్తీ కావడంతో అక్కడ చోటు దక్కే పరిస్థితి లేదు. దాదాపు 200 మంది విద్యార్థులు అడ్మిషన్ కోసం వచ్చి వెళ్లినట్లు సమాచారం. ఈ పరిస్థితి ఈ ఒక్క హాస్టల్‌లోనే కాదు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.

అనంతపురం రూరల్: ప్రభుత్వ వసతి గృహాల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య ఏటా గణనీయంగా పెరుగుతోంది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో వసతి గృహాల్లో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. రుచికరమైన భోజనాన్ని అందించడంతో పాటు కార్పొరేట్ తరహా సౌకర్యాలు కల్పించడంతో జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో సీట్లు భర్తీ అయ్యాయి.

టీడీపీ హయాంలో నిర్వీర్యం

టీడీపీ హయాంలో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ బీసీ గిరిజన సంక్షేమ శాఖల వసతి గృహాల్లో కనీస సదుపాయాలు లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారు. కనీసం తాగేందుకు మంచినీరు కూడా లభించని దుస్థితి అప్పట్లో ఉండేది. ఉడికీఉడకని అన్నం, నీళ్ల చారుతో సరిపెట్టుకున్నారు. ఇక బాత్ రూమ్‌ల వైపు అడుగు కూడా వేయలేని పరిస్థితి. దీంతో చాలా హాస్టళ్లలో విద్యార్థులు ఆరుబయట బోరుబావుల వద్దనే స్నానం చేసేవారు. మూత్ర విసర్జనకు ఆరు బయటకు పరుగు తీసేవారు. బాలికల పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉండేది. దుర్గంధంతో నిండుకున్న హాస్టళ్లలో పందికొక్కులు సంచరిస్తూ విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేసేవి. హాస్టళ్ల మరమ్మతుకు అవసరమైన నిధులను అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో చాలా భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

కార్పొరేట్ తరహా సౌకర్యాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నిరుపేద విద్యార్థుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట వేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ వసతి గృహాల్లో కార్పొరేట్ తరహా సౌకర్యాలు కల్పించారు. నాణ్యమైన భోజనం అందించాలన్న ఉద్దేశ్యంతో మెనూలో సమూల మార్పులు తీసుకొచ్చారు. దీంతో వసతి గృహాల్లో చేరే విద్యార్థుల సంఖ్య ఏటా గణనీయంగా పెరుగుతూ వస్తోంది. జిల్లాలో బీసీ సంక్షేమశాఖ వసతి గృహాలు 54 ఉండగా వీటన్నింటిలో దాదాపు 7 వేల మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. అలాగే 56 ఎస్సీ హాస్టళ్లలో దాదాపు 6 వేల మంది, 11 గిరిజన సంక్షేమ శాఖ హాస్టళ్లలో 2 వేల మంది విద్యార్థుల ఆశ్రయం పొందారు. విద్యార్థులు చేరేందుకు మరింత గడువు ఉండడంతో ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సౌకర్యాలు బాగున్నాయి

గతంలో హాస్టల్‌లో ఉండాలంటే చాలా భయమేసేది. సరైన భోజనం పెట్టేవారు కాదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మా ఇళ్లలో కంటే ఇక్కడే మెరుగైన సౌకర్యాలు ఉన్నాయి. రుచికరమైన భోజనం అందిస్తున్నారు. దీంతో చదువులపై దృష్టి సారించగలుగుతున్నాం.

– అమని, 9వ తరగతి

ఉన్నతంగా చదువుకుంటాం

గతంలో ఎన్నడూ లేనంతగా రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నారు. వసతులూ బాగున్నాయి. సమస్యలేవీ లేవు. చదువుకునేందుకు ప్రశాంత వాతావరణాన్ని కల్పించారు. దీంతో మా దృష్టి మొత్తం చదువులపైనే నిమగ్నమైంది. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా చదువుకుంటాం.

– శ్రావణి, 9 వ తరగతి

రూపురేఖలు మారిపోయాయి

ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో వసతి గృహాల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. నూతన మెనూ అమలుతో పాటు వసతి గృహాల్లో అన్ని రకాల మౌలిక సౌకర్యాలను ప్రభుత్వం కల్పించింది. దీంతో వసతి గృహాల్లో చేరే విద్యార్థుల సంఖ్య మా అంచనాలకు మించి పోయింది.

– కుష్బూకొఠారి, డీడీ, బీసీ సంక్షేమ శాఖ

– మధుసూదనరావు, జేడీ, సాంఘిక సంక్షేమ శాఖ

పీఆర్ ఇన్‌చార్జ్ ఈఈగా శంకరయ్య



అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ అనుబంధ పీఐయూ విభాగం ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)గా కె.శంకరయ్య నియమితులయ్యారు. ఈమేరకు ఆ విభాగం ఇంజినీరింగ్ చీఫ్ జారీ చేసిన ఉత్తర్వులు జిల్లా పీఆర్ సూపరింటెండెంట్ కార్యాలయానికి మంగళవారం అందాయి. కళ్యాణదుర్గం డీఈఈగా పని చేస్తున్న శంకరయ్యను ఎఫ్ఏసీ కింద ఈఈగా నియమించారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఇన్‌చార్జ్ ఈఈగా పని చేసిన రవి (తాడిపత్రి డీఈ)పై అనేక ఆరోపణలు రావడంతో ఆయన్ను ఈఈ బాధ్యతల నుంచి తప్పించారు. అనంతరం క్వాలిటీ విభాగం ఈఈకి అదనపు బాధ్యతలు అప్పగించినా ఆయన అక్కడ చేరేందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. దీంతో శంకరయ్యను నియమించారు. ఒకట్రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

టీటీడీ ఆధ్వర్యంలో చిన్నారులకు కథల పోటీలు

అనంతపురం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఈ నెల 30న కథల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జిల్లా టీటీడీ ధర్మప్రచార పరిషత్తు ప్రతినిధులు బాబు, పండిట్ వేణు తెలిపారు. నగరంలోని టీటీడీ కల్యాణ మంటపం వేదికగా 'కథ చెపుతారా..ఊ కొడదాం' పేరుతో పోటీలు ఉంటాయి. మొదటి విభాగంలో 10 ఏళ్ల లోపు చిన్నారులు, రెండో విభాగంలో 10 నుంచి 15 ఏళ్ల మధ్య వయసు పోటీ పడాల్సి ఉంటుంది. ఆధ్యాత్మిక, సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే కథలను చిన్నారులు ఎంచుకోవాల్సి ఉంటుంది. ఒక్కో చిన్నారికి 5 నిముషాల సమయం కేటాయిస్తారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీలకు చిన్నారులను ప్రోత్సహించి, సనాతన వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను నిర్వాహకులు కోరారు.

విద్యుదాఘాతంతో వైఎస్సార్‌సీపీ నేత మృతి

- భార్యాపిల్లలను కాపాడి.. తాను మృత్యు ఒడికి
- నివాళులర్పించిన ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యేలు జొన్నలగడ్డ పద్మావతి, అనంత వెంకట్రామిరెడ్డి



బాలకృష్ణ (ఫైల్)

నార్పల: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన భార్య, పిల్లలను కాపాడే ప్రయత్నంలో వైఎస్సార్‌సీపీ నేత ప్రాణాలు కోల్పోయాడు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు.. నార్పలకు చెందిన బాలనాగి బాలకృష్ణ (40)కు భార్య భాగ్యలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. ఈ క్రమంలో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున భాగ్యలక్ష్మి పోటీ చేసి ఎంపీటీసీ సభ్యురాలిగా గెలుపొందింది. వ్యవసాయ పనులతో కుటుంబాన్ని పోషించుకునేవారు. విద్యుత్ తీగపై పడి మంగళవారం ఉదయం భార్య, పిల్లలను పిలుచుకుని పొలానికి బాలకృష్ణ వెళ్లారు. అక్కడ మొక్కజొన్న పంటకు బాలకృష్ణ పురుగు మందు పిచికారీ చేస్తుండగా పిల్లలను పిలుచుకుని గట్టు పక్కగా భాగ్యలక్ష్మి నడుచుకుంటూ వెళ్లింది. ఆ సమయంలో చిన్న కుమారుడు అదుపు తప్పి పక్క రైతు పొలం వైపు గట్టును ఓ చేతితో తాకాడు. అప్పటికే అడవి పందుల బెడద నుంచి దానిమ్మ పంటను కాపాడుకునేందుకు పక్క పొలం రైతు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ తగలడంతో చిన్న కుమారుడితో పాటు అతని చేతిని పట్టుకున్న పెద్ద కుమారుడు, భాగ్యలక్ష్మికి విద్యుత్ ప్రసారం జరిగి షాక్‌కు గురై, గట్టిగా కేకలు వేశారు. సమీపంలోనే ఉన్న బాలకృష్ణ ప్రమాదాన్ని పసిగట్టి వెంటనే తన పంచెను తీసి చిన్న కుమారుడి మెడకేసి బలంగా లాగాడు. ఆ ధాటికి విద్యుత్ షాక్ నుంచి తల్లి, కుమారులు బయటపడ్డారు. అయితే కుమారుడిని లాగే ప్రయత్నంలో బాలకృష్ణ అదుపు తప్పి నేరుగా వెళ్లి విద్యుత్ తీగపై పడ్డాడు. కుటుంబసభ్యుల కేకలు విన్న చుట్టుపక్కల రైతులు వెంటనే విద్యుత్ సరఫరా ఆపి బాలకృష్ణను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజశేఖరరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి



ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి



పరామర్శిస్తున్న ఎంపీ రంగయ్య

పలువురి నివాళి

బాలకృష్ణ మృతిచెందినట్లు తెలియగానే శింగనమల, అనంతపురం ఎమ్మెల్యేలు జొన్నలగడ్డ పద్మావతి, అనంత వెంకట్రామిరెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు నార్పల సత్యనారాయణరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. సర్వజనాస్పత్రికి ఎమ్మెల్యే పద్మావతి, ఆలూరి సాంబశివారెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు తదితరులు చేరుకుని బాలకృష్ణ మృతదేహానికి నివాళులర్పించారు. నార్పలకు మృతదేహాన్ని తరలించిన అనంతరం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుడికి నివాళులర్పించారు. అలాగే సాయంత్రం ఎంపీ రంగయ్య సైతం నార్పలకు చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

విద్యార్థులకు స్వల్ప అస్వస్థత



విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ వేణుకార్తికేయ

శెట్టూరు: మండలంలోని కనుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తర్వాత విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఏడో తరగతి చదువుతున్న 15 మందికి శరీరంపై చిన్న పాటి దద్దుర్లు లేచి, దురదతో ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు స్థానిక ఎంఎల్‌హెచ్‌పీ హరిత సాయంతో ప్రథమ చికిత్స అందజేయించారు. అనంతరం 108 అంబులెన్స్‌లో శెట్టూరు పీహెచ్‌సీకి తరలించారు. పిల్లల తల్లిదండ్రులకు విషయం ఆలస్యంగా తెలవడంతో ఆస్పత్రి వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. విద్యార్థులకు డాక్టర్ వేణుకార్తికేయ చికిత్స అందించారు. పిల్లలకు ఎలాంటి ప్రమాదం లేదన్నారు. పాఠశాలలో ఫ్లోరింగ్ పనులు జరుగుతుండటంతో ఏడో తరగతి విద్యార్థులు ఆరుబయట చింత చెట్టు కింద కూర్చొన్నారని, డస్ట్ అలర్జీ వల్ల శరీరంపై దద్దుర్లు వచ్చి ఉంటాయని అనుమానాలు వ్యక్తమయ్యాయి. విషయం తెలుసుకున్న డీఈఓ సాయిరాం ఫోన్‌లో డాక్టర్‌తో మాట్లాడి ఘటనపై ఆరా తీశారు. ఎంఈఓ శ్రీధర్, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ సోమనాథరెడ్డి, నాయకులు హరినాథరెడ్డి, కనుకూరు సర్పంచ్ వెంకటేశులు, స్కూల్ కమిటీ చైర్మన్ కిష్టప్ప తదితరులు ఆస్పత్రికి చేరుకుని విద్యార్థులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. చికిత్స అనంతరం విద్యార్థులను ఇంటికి పంపారు.

జగన్‌పై ప్రజల్లో నమ్మకం పెరిగింది

- అసైన్డ్ భూములపై రైతులకు హక్కు చరిత్రాత్మక నిర్ణయం
- మాజీ ఎమ్మెల్యే విశ్వ

విడపనకల్లు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనతో రాష్ట్ర ప్రజలందరూ సంతృప్తిగా ఉన్నారని, ఈ క్రమంలో సీఎం జగన్‌పై వారి నమ్మకం మరింత పెరిగిందని వైఎస్సార్‌సీపీ ఉరవకొండ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. విడపనకల్లు మండలం కొట్టాలపల్లిలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ పరిపాలనను దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజలకు సీఎం జగన్ చేస్తున్నంత మేలు గతంలో ఏ ముఖ్యమంత్రి చేయలేదన్నారు. 20 సంవత్సరాలకు పైగా అసైన్డ్ భూములను సాగు చేస్తున్న వారికి ఆ భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అసైన్డ్ భూములో వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్న రైతులకు వాటిని అమ్ముకునేందుకు, వాటిపై బ్యాంకు రుణాలు తీసుకునేందుకు మార్గం సుగమమైందన్నారు. సాగు చేసిన పంటలు ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతింటే అదే సీజన్‌లో రైతులను ఆదుకునేందుకు రూ.3వేల కోట్ల నిధిని కేటాయించడం గొప్ప విషయమన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు సీఎం జగన్ కృషి చేస్తుంటే లేనిపోని తప్పుడు ఆరోపణలతో ప్రతిపక్ష పార్టీలు జనాన్ని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. అయినా ప్రజలెవ్వరూ విపక్షాల ఆరోపణలను పట్టించుకోవడం లేదన్నారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ సభ్యుడు హనుమంతు, వైస్ ఎంపీపీ మోదుపల్లి సునీత రాణి, జేసీఎస్ కన్వీనర్ భరత్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు సుంకన్న, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వై.విశ్వేశ్వరరెడ్డి

రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని చూపుతున్న అధికారులు

గుత్తి రూరల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు తెలిపిన మేరకు... యాడికి గ్రామానికి చెందిన పలువురు గ్రామాల్లో సేకరించిన 23.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని 40 బస్తాల్లో నింపి బొలెరో వాహనంలో కరిడికొండకు తరలిస్తుండగా ఎంగిలిబండ క్రాస్ వద్ద విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి పోలీసులకు, స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. బియ్యం తరలిస్తున్న కరిడికొండ నివాసి, బొలెరో డ్రైవర్ దాసరి శంకర్‌ను అరెస్టు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు వెంకటరమణ, యామిని సరస్వతి, సీఎస్‌డీటీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

శింగనమల: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ రామారావు తెలిపిన మేరకు.. అందిన ముందస్తు సమాచారంతో శింగనమల మండలం సోదనపల్లి వద్ద మంగళవారం ఉదయం విజిలెన్స్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఆటో 18 ప్యాకెట్ల రేషన్ బియ్యం తరలిస్తూ గార్లదిన్నెకు చెందిన శ్రీనివాసులు పట్టుబడ్డాడు. వాహనాన్ని సీజ్ చేసి, శ్రీనివాసులపై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. తనిఖీల్లో సీఎస్‌డీటీ రాజశేఖర్, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం

అనంతపురం: యూనివర్సిటీ పరిధిలో క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇస్తున్నట్లు జేఎన్‌టీయూ (అనంతపురం) వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన తెలిపారు. వర్సిటీలో మంగళవారం అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఫిజికల్ డైరెక్టర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. 2023–24 విద్యా సంవత్సరంలో క్రీడాపోటీల నిర్వహణపై చర్చించారు. క్రీడలతో పాటు యోగా తప్పనిసరిగా నిర్వహించాలని వైస్ చాన్స్‌లర్ ఆదేశించారు. ప్రతిభావంత క్రీడాకారులను వెలికితీయడానికి ప్రతి ఫిజికల్ డైరెక్టర్ కృషి చేయాలన్నారు. ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో మెన్, ఉమెన్ ఫిజికల్ డైరెక్టర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు వర్సిటీ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. 300 మంది క్రీడాకారులు సౌత్ జోన్, ఆలిండియా స్థాయిలో ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. సమావేశంలో జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బి.జోజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణకాంతి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.రామశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూఏ వీసీ రంగజనార్ధన

కలెక్టర్‌ను కలిసిన వీఆర్వోల సంఘం నాయకులు



కలెక్టర్ గౌతమికి బొకే అందజేస్తున్న వీఆర్వోల సంఘం నాయకులు

రాప్తాడు రూరల్: జిల్లా కలెక్టర్ ఎం.గౌతమిని గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో) సంఘం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1గా గుర్తించేలా చూడాలని, 6 ఏళ్లు, 12 ఏళ్ల ఇంక్రిమెంట్లను త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, గ్రామ రెవెన్యూ అధికారి మరణించిన తర్వాత వారి కుటుంబంలో ఒకరిని కారుణ్య నియామకం కింద జూనియర్ అసిస్టెంట్‌గా నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. సమస్యల పరిష్కారంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించడంతో నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వీఆర్వోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వై.మన్మథరెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, ఈసీ సభ్యుడు ఎస్.రమేష్, జిల్లా నాయకులు స్వరూప్, సాయికుమార్, పురుషోత్తం, ప్రవీణ్, రామాంజనేయులు, హరికృష్ణనాయక్, రాజకుళ్లాయప్ప, సరిత, నిరంజన్, ఆసిక్, తదితరులు ఉన్నారు.

ఆలయంలో చోరీ

శెట్టూరు: మండలంలోని పర్లచేడు గ్రామంలో వెలసిన తాటి మానెమ్మ ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు ఆలయంలోకి చొరబడి దాదాపు రెండు కిలోల వెండి ఆభరణాలను అపహరించుకెళ్లారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

వైద్య సేవల్లో నిర్లక్ష్యం కన్పించకూడదు

- డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్

అనంతపురం క్రైం: రోగులకు అందించే వైద్య సేవల్లో నిర్లక్ష్యం కనిపించకూడదని డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్ వైద్యాధికారులను ఆదేశించారు. గత కొన్ని రోజులుగా యూ విన్ పోర్టల్‌పై వైద్యాధికారులకు డీఎంహెచ్ఓ కార్యాలయంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించాలన్నారు. క్షేత్రస్థాయిలోనూ పర్యటించి, ప్రజారోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫీవర్ సర్వే కొనసాగించాలన్నారు. మాతా, శిశు మరణాల నివారణకు కృషి చేయాలన్నారు. ఆస్పత్రుల్లో ప్రసవం పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చెన్నకేశవులు, డాక్టర్ రాజేష్, డాక్టర్ మహేంద్ర నాథ్ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శారదామాత నామస్మరణ

అనంతపురం కల్చరల్: నగరంలోని శ్రీ శృంగేరి శారదా శంకర మఠం ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మ వారి నామస్మరణతో మార్మోగింది. తొలి శ్రావణ మంగళవారం మఠంలో అఖండ లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం జరిగింది. అధిక సంఖ్యలో తరలి వచ్చిన మ హిళలు బారులు తీరి అమ్మవారి ముందు భక్తిశ్రద్ధలతో పారాయణం చేశారు. ఈ సందర్భంగా శారదామాతకు కుంకుమార్చన, అభిషేకాలు, అలంకార సేవలు జరిగాయి. మఠం గౌరవాధికారి ఎంఎస్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో సాయంత్రం పారాయణం ముగింపు సందర్భంగా ప్రసాద వితరణ చేశారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు అందిస్తున్న సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీడీఓ విజయ్ ప్రసాద్

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లిలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించారు. సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాలలోని 42 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందించినట్లు తెలిపారు. ఎంపీడీఓ విజయ్ ప్రసాద్, ఎంఈఓ రామాంజనేయులు, మాజీ సర్పంచ్ ఓబిరెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ వడ్డుపల్లి నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలికకు ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న నోబెల్ హెల్పింగ్ హ్యాండ్స్ మెహరాజ్ హుస్సేన్, మేయర్ వసీం

అనంతపురం క్రైం: నగరంలోని మున్నా నగర్‌కు చెందిన దాదాపీర్ (ఆటో డ్రైవర్) కుమార్తె షేక్ మామా జిగిని అనే బాలిక ఫ్యాన్‌కో అమీనియాతో బాధపడుతోంది. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 లక్షలు అవసరం ఉంది. ఇప్పటికే ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షలు వైద్యానికి, ఆర్డీటీ రూ.5 లక్షలు అందించింది. ఇంకా ఇతర వైద్య ఖర్చుల నిమిత్తం హెల్పింగ్ హ్యాండ్స్ మెహరాజ్ మిత్ర బృందం బాధిత బాలిక జిగినీకి రూ.99 వేలు ఆర్థిక సహాయాన్ని మేయర్ వసీం క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశారు.

ఇంటింటా ఓటర్ల సర్వే పక్కాగా చేపట్టండి

కనగానపల్లి: ఈ నెల 21 నుంచి ఇంటింటా ఓటర్ల సర్వేను పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ రమాదేవి బీఎల్ఓలను ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల సర్వే కార్యక్రమంపై బీఎల్ఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సుమారు నెల రోజులు పాటు జరిగే ఈ సర్వే కార్యక్రమం ద్వారా కొత్త ఓటర్ల నమోదుతో పాటు తొలగింపులు, చేర్పులు, వివరాల మార్పులు కూడా చేపట్టాలన్నారు. ఓటర్ల నమోదులో ఎలాంటి రాజకీయ పక్షపాతం లేకుండా 18 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, పలువురు వీఆర్వోలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల్లా

సేవలందిస్తున్నారు

రాప్తాడురూరల్: వలంటీర్ల వ్యవస్థ తీసుకొచ్చి ఇంటివద్దకే సేవలందిస్తున్న ప్రభుత్వాన్ని తాటిచెర్ల గ్రామస్తులు కొనియాడుతున్నారు. వలంటీర్లు కుటుంబ సభ్యుల్లా సేవలందిస్తున్నారని చిన్నపెద్దన్న, సుబ్రమణ్యం, చిన్న పోలేరయ్య, ఆర్.పరంధామ, తలారి ఎర్రెమ్మ, అబ్దుల్, దస్తగిరి తదితరులు చెబుతున్నారు. గతంలో పింఛన్ సొమ్ము కోసం ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్ల వద్దకు వెళ్లి పడిగాపులు కాసే పరిస్థితి ఉండేది. రోజంతా కాచుకున్నా, వేలిముద్రలు పడకపోయినా, సాంకేతిక సమస్య తలెత్తినా మరుసటి రోజు రమ్మని చెప్పేవారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థతో ఆ ఇబ్బందులు తప్పాయంటున్నారు. ఒకటో తేదీ వచ్చిందంటే చాలు తెలవారకనే ఇంటివద్దకు వచ్చి పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. కరోనా సమయంలో మా ఊరిలోని 12 మంది వలంటీర్లు అందించిన సేవలను జీవితాంతం మరువలేమని చెబుతున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హుసేనమ్మకు పింఛన్ ఇచ్చేందుకు వేలిముద్రలు తీసుకుంటున్న వలంటీరు బ్యాళ్ల జ్యోతి

ఆస్పత్రికొచ్చి పింఛన్ ఇచ్చింది



నాకు కాలికి శస్త్రచికిత్స జరిగింది. ఆస్పత్రిలో చేరితే మా వలంటీరు బ్యాళ్ల జ్యోతి ఆస్పత్రికి వచ్చి పింఛన్ సొమ్ము అందజేసింది. సేవా దృక్పథంతోనే ఇంత దూరం వచ్చి పింఛన్ ఇచ్చింది. ఎప్పుడూ ఏ చిన్న అవసరం వచ్చి ఫోన్ చేసినా వెంటనే స్పందిస్తోంది. ప్రభుత్వం అందించే పథకాలన్నీ ఆమె మా ఇంటిద్దకు వచ్చి దరఖాస్తు తీసుకుంటుంది. మాలాంటి వాళ్లకు ఇంతకన్నా ఇంకేం కావాలి.

– హుసేనమ్మ, తాటిచెర్ల
అనంతపురం రూరల్ మండలం

ఇంటింటా సర్వే పారదర్శకంగా చేపట్టండి



మాట్లాడుతున్న ఎన్నికల నియోజకవర్గ ప్రత్యేకాధికారి నరసింహారెడ్డి

రాప్తాడు: ఓటర్ల జాబితాలో పొరపాట్లు లేకుండా పక్కాగా జాబితా సిద్ధం చేసేందుకు ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్ఓలు ఇంటింటా సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని డీఆర్‌డీఏ పీడీ, ఎన్నికల నియోజకవర్గ ప్రత్యేకాధికారి నరసింహారెడ్డి తెలిపారు. ఓటర్ల జాబితాపై బీఎల్ఓలతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల జాబితాలతో ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు ప్రతి ఇంటికీ బీఎల్ఓలు వెళ్లి, ఓటర్లు తమ పేర్లు, ఆధార్ నంబర్లు, ఇంటి పేర్లు తదితర వివరాలు జాబితాలో సరిగా ఉన్నవీ లేనిదీ సరి చూసుకోవాలన్నారు. ఎక్కడైనా అర్హత లేని వారికి ఓట్లు ఉంటే రాజకీయ పార్టీలు ఫిర్యాదులు అందిస్తే, అలాంటి ఓట్లను తొలగిస్తామని చెప్పారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లయితే ఆధారాలతో సహా ఆర్డీఓ కార్యాలయానికి ఫిర్యాదు చేస్తే విచారణ చేసి, ఒక చోట ఓటు హక్కు ఉంచి, మరో చోట తొలగిస్తామని చెప్పారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు నియమించుకునే పోలింగ్ ఏజెంట్ల వివరాలను తక్షణమే అందజేయాలని కోరారు. 1,200 ఓట్లు దాటి ఉన్న పోలింగ్ కేంద్రాల విభజన కోసం గ్రామస్తుల దరఖాస్తు మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ఈడీటీ మల్లికార్జున, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ఏసీలు మరమ్మతు చేయించాలి

- సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు



అడ్మిషన్‌లో ఉన్న మహిళతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని వివిధ విభాగాల్లో ఏసీలను మరమ్మతు చేయించేలా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు ఏపీఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆస్పత్రిలో సర్జికల్ విభాగం, ఆపరేషన్ థియేటర్లను ఆయన పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్ సమీపంలో జన సమూహం ఎక్కువగా లేకుండా చర్యలు తీసుకోవాలని అనస్తీషియా హెచ్ఓడీ డాక్టర్ నవీన్‌ను ఆదేశించారు. పెయిన్ రిలీఫ్ క్లినిక్‌ను మరో అనువైన ప్రాంతంలో ఉంచి పాలియేటివ్ సేవలను కొనసాగించాలన్నారు. అనంతరం రోగులతో సూపరింటెండెంట్ ఓపిగ్గా మాట్లాడారు. వైద్యులు, స్టాఫ్‌నర్సులు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. బయోమెడికల్ వేస్ట్‌మేనేజ్‌మెంట్‌ను పక్కాగా నిర్వహించేలా చూడాలని ఐసీఎస్ స్టాఫ్‌నర్సులను ఆదేశించారు. ఆస్పత్రిలో అడ్మిషన్‌లో ఉన్న రోగులు త్వరగా కోలుకోవడానికి రోగుల బంధువులు సహకరించాలని సూపరింటెండెంట్ కోరారు. ఎలాంటి అనుమతి లేకుండా అత్యవసర విభాగాలు, గైనిక్, లేబర్, ఎస్ఎన్‌సీయూ, ఐసీయూ తదితర వార్డుల్లోకి అతిగా రాకూడదన్నారు. ఇన్‌చార్జ్ ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ అభిషేక్, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు మంజు, రజిని, ఐసీఎస్ స్టాఫ్‌నర్సులు ఉన్నారు.

తైక్వాండో సంఘం జిల్లా అధ్యక్షుడిగా శాంతరాజ్

అనంతపురం: తైక్వాండో సంఘం జిల్లా అధ్యక్షుడిగా శాంతరాజ్ నియమితులయ్యారు. ఈ నెల 15న జరిగిన తైక్వాండో సంఘం సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సుదీర్ఘ కాలంగా తైక్వాండో క్రీడా శిక్షణ ఇస్తూ ఎంతో మంది క్రీడాకారులను జిల్లా, రాష్ట్ర , జాతీయ స్థాయిలో క్రీడా పతకాలను తీసుకొచ్చేలా కృషి చేశారు. జిల్లా తైక్వాండో సంఘం అధ్యక్షుడిగా నియామకం కావడంపై పలువురు అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'



హంపాపురంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు



తలుపూరులో లబ్ధిదారురాలికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న దృశ్యం

రాప్తాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఒక వరం 'జగనన్న సురక్ష' అని ఎంపీడీఓ సాల్మన్, తహసీల్దార్ లక్ష్మీనరసింహ తెలిపారు. మంగళవారం మండలంలోని హంపాపురం గ్రామంలో సర్పంచు లక్ష్మీదేవి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లను క్షేత్ర స్థాయిలోనే ఉచితంగా పొందొచ్చన్నారు. జగనన్న సురక్ష ద్వారా అందించే సేవలను ప్రజలకు ఉచితంగా అందించడానికి అన్ని రకాల చార్జీలను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అనంతరం దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వర ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు మహాలక్ష్మి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు వర్తింపు

ఆత్మకూరు: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని ఎంపీపీ హేమలత తెలిపారు. మంగళవారం తలుపూరు సచివాలయంలో ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సహాయంతో ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షర్మిల, ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఓబులేష్, లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీటీసీ ఓబులేష్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్ర శేఖర్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ నరసింహారెడ్డి, మండల యూత్ కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, వైస్ ఎంపీపీలు విజయ్, నాయకులు శివారెడ్డి, ఓబిరెడ్డి,అతికిరెడ్డి శ్రీరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు ఇంటర్వ్యూలు

ఆత్మకూరు: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకుదరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్ మంగళవారం తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించాలి

అనంతపురం అర్బన్: వేతన బకాయిలను చెల్లించాలంటూ ఏఐయూటీయూసీ, ఏపీ యునైటెడ్ గ్రామ పంచాయతీ శానిటరీ వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు (క్లాప్ మిత్రలు) మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎన్ అశోక్ మాట్లాడుతూ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బకాయిపడిన వేతనాలను ప్రభుత్వం తక్షణం చెల్లించాలన్నారు. స్వచ్ఛఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ద్వారానే కార్మికులు వేతనాలను ప్రభుత్వం చెల్లించాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు రాఘవేంద్ర, నాయకులు కిశోర్, నాగముత్యాలు, శివప్ప, కార్మికులు పాల్గొన్నారు.

తాగుబోతుల వీరంగం

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: స్థానిక శ్రీనివాస్ నగర్‌కు చెందిన విష్ణువర్ధన్, చైతన్య తప్ప తాగి రోడ్డుపై వెళ్తున్న ఓ విద్యార్థిపై దాడి చేశారు. బాధిత విద్యార్థి త్రీటౌన్ పోలీసులను మంగళవారం ఆశ్రయించారు. పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని తాగుబోతులను అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రికవరీ వాహన సామగ్రి అపహరణ

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: స్థానిక నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రికవరీ వాహన సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడు దాదు మంగళవారం చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ప్రమాదానికి గురైన వాహనాలను మరో ప్రాంతానికి రికవరీ వస్తువులు తరలించే క్రమంలో గత నెల 29న స్థానిక జనశక్తి నగర్‌లోని దాదు ఇంటి ముందు ఆపిన వాహనంలో నుంచి ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ఏఐఎస్ఎఫ్ ధర్నా

అనంతపురం అర్బన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేయాలన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా కాస్మొటిక్ చార్జీలు పెంచాలన్నారు. నాలుగేళ్ల డిగ్రీ విద్యావిధానాన్ని రద్దు చేసి, మూడేళ్ల డిగ్రీ కోర్సును కొనసాగించాలన్నారు. జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలన్నారు. విశ్వవిద్యాయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయిస్వామి, చిరంజీవి, నాయకులు హనుమంతు, రమణయ్య, ఆంజనేయులు, నరసింహ, ఉమామహేశ్, వంశీ, చిరంజీవి, రాజేశ్, వెంకటనాయక్, ఆనంద్, జగదీశ్, చందు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి



జనశక్తి నగర్‌లో రేషన్‌కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పేద, సామాన్య మధ్యతరగతి ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచిందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని భవానీనగర్, జనశక్తి నగర్, శారదానగర్‌లలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రభుత్వ సేవలకు సంబంధించి రేషన్‌కార్డు, కుల, ఆదాయ, తదితర ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం, బీజేపీ, జనసేన పార్టీలు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశాయన్నారు. నాలుగేళ్లలోనే పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కోవిడ్‌లాంటి విపత్కర పరిస్థితుల్లో సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఎంతో మందికి పునర్జన్మ ప్రసాదించినట్లయ్యిందని అన్నారు. ఆ సమయంలో సిబ్బంది, వలంటీర్లు స్ఫూర్తిదాయక సేవలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. సంక్షేమం అందించడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని, తద్వారా ప్రభుత్వానికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల్లో ఎనలేని ఆదరణ వస్తోందన్నారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పవన్ కళ్యాణ్ వలంటీర్లపై విషం వెల్లగక్కుతున్నారన్నారు.

టిడ్కో ఇళ్లు అందిస్తాం: గత టీడీపీ ప్రభుత్వం టిడ్కో పేరుతో నియోజకవర్గ ప్రజలను వంచించిందని ఎమ్మెల్యే అన్నారు. తమ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లను పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని, త్వరలో 2304 మందికి టిడ్కో ఇళ్లను అందిస్తున్నామన్నారు. జగనన్న కాలనీల్లో 23 వేల మందికి ఇళ్ల పట్టాలను అందించామన్నారు. వన్‌టైం సెటిల్‌మెంట్ కింద నామమాత్రపు ఫీజుతో స్థలంపై సర్వ హక్కులను అందజేసినట్లు తెలిపారు. కామారుపల్లి లబ్ధిదారులకు మరో ప్రాంతంలో ఇళ్ల స్థలాలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్లు ఎం.దేవి, వై.లక్ష్మీదేవి, సుమతి, గోగుల లక్ష్మీదేవి, హరిత, సంపంగి రామాంజనేయులు, రహంతుల్లా, సైపుల్లాబేగ్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్ పీరా, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు చింతకుంట మధు, లక్ష్మన్న, వైఎస్సార్ సీపీ నేత జయరాంనాయుడు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలున్న నేత ఉమెన్ చాందీ

- ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్



ఉమెన్ చాందీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: నైతిక విలువలు కలిగిన వ్యక్తి కేరళ మాజీ ముఖ్యమంత్రి ఉమెన్ చాందీ అని ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ అన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో కేరళ మాజీ ముఖ్యమంత్రి ఉమెన్ చాందీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ నాయకుల్లో నైతిక విలువలున్న వ్యక్తి, ప్రజానేత ఉమెన్ చాందీ అని, ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. కేరళ రాష్ట్రంలో 2004 నుంచి 2006 వరకూ, 2011 నుంచి 2016 వరకూ ముఖ్యమంత్రిగా పని చేశారన్నారు. 2018లో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కూడా ఎంపికయ్యారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు అందించారన్నారు. 12 సార్లు ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర ప్రజలకు సేవలు అందించారన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, దాదా గాంధీ, గాజుల వాసు, శివ శంకర్ యాదవ్, రామచరణ్ యాదవ్, పరమేశ్వర్‌రెడ్డి, కడియాల ఫకృద్దీన్, ఎంఎండీ ఇమాం, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి



ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందు వీధి వ్యాపారులకు స్థల కేటాయింపుపై చర్చిస్తున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి, అదనపు కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై నగరపాలక సంస్థ, పోలీసు అధికారులు దృష్టిసారించారు. రోగుల సౌకర్యార్థం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందున్న తోపుడుబండ్లలో వ్యాపారాలు చేస్తున్న వారిని అక్కడి నుంచి తొలగించేలా నగరపాలక సంస్థ అధికారులు, పోలీసులు ఈ నెల 17న చర్యలు తీసుకున్నారు. అదే ప్రాంతంలో నగరపాలక సంస్థ అధికారులు మొక్కలు నాటారు. మంగళవారం ఆస్పత్రి ముందు వ్యాపారులు తోపుడు బండ్లు ఉంచడంతో నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్, టూటౌన్ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వీధి వ్యాపారులు, సిబ్బంది మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సాయంత్రం డీఎస్పీ ప్రసాదరెడ్డి, అదనపు కమిషనర్ రమణారెడ్డి ఘటన స్థలానికి వెళ్లి, వ్యాపారులకు నచ్చజెప్పారు. ఫ్లై ఓవర్ కింద వ్యాపారాలు చేసుకునేలా, స్ట్రీట్ వెండర్ కార్డులు అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

ఆర్జేడీని కలిసిన వైఎస్సార్‌టీఎఫ్ నేత



ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డికి బొకే అందిస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఓబుళపతి

రాప్తాడురూరల్: జిల్లా పర్యటనకు వచ్చిన పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ వెంకట కృష్ణారెడ్డిని ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి కె. ఓబుళపతి మంగళవారం కలిశారు. మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎంఈఓ-2లకు, రీ అపోర్షమెంట్ ద్వారా బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించేలా చూడాలని ఆర్జేడీని కోరారు. ఉపాధ్యాయుల సర్వీస్ సమస్యలు పరిష్కరించాలని ఓబుళపతి విన్నవించగా ఆర్జేడీ సానుకూలంగా స్పందించారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

కనగానపల్లి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పని చేస్తూ పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు రమాదేవి స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్ఎం లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, ఆమెకు శాలువాలు, పూలమాలలు వేసి సన్మానించారు. పాఠశాలకు బదిలీపై వచ్చిన పలువురు ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు.

పేదలకు రక్ష..జగనన్న సురక్ష

చెన్నేకొత్తపల్లి: పేదలకు రక్ష..జగనన్న సురక్ష అని ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి అన్నారు. మంగళవారం నాగసముద్రంలో సర్పంచ్ మొండిగట్ల సుధారాణి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించడంతోపాటు 11 రకాల సేవలను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.

రెస్టారెంట్లలో ఇష్టారాజ్యం

- మద్యం తాగేందుకు అనుమతి ఇస్తున్న నిర్వాహకులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్:

- నగర శివారులో 'ఫ్యామిలీ రెస్టారెంట్' పేరుతో ఏర్పాటు చేసిన ఓ హోటల్లో మద్యం తాగేందుకు అనుమతిస్తున్నారు. ఇది ఓ పోలీసు అధికారి వ్యాపార భాగస్వామ్యంతో నడుస్తున్న రెస్టారెంట్‌గా తెలిసింది. ఇటు పోలీసులు, అటు ఎక్సైజ్, సెబ్ అధికారులు కన్నెత్తి చూడడంలేదు. ఇలాంటివి నగరంలో మరికొన్ని ఉన్నాయి.
- నగర శివారులోని 44వ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న కొన్ని హోటళ్లలో నిర్వాహకులు పొరుగు రాష్ట్రాల మద్యాన్ని తెప్పిస్తున్నారు. హోటళ్లకు వచ్చే వారి నుంచి ముందస్తుగా ఆర్డర్ తీసుకొని తెప్పిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రుద్రంపేట నుంచి రాప్తాడు మధ్య జాతీయ రహదారి పక్కనే ఉన్న రెండు హోటళ్లలో మద్యం వ్యాపారం జోరుగా సాగుతోంది.



రెస్టారెంట్లో మద్యం బాటిల్

అధికారులకు మామూళ్లు..: మద్యం తాగేందుకు అనుమతించే వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మామూళ్లు తీసుకొని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొందరు అక్కడే తిన్నంత తిని, మామూళ్లు కూడా తీసుకెళ్తున్నారన్న విమర్శలున్నాయి. ఇంకొందరు ఇళ్లకు పార్శిళ్లు తీసుకెళ్తున్నట్లు సమాచారం. మరోవైపు మద్యం తాపకపోతే హోటళ్లు, దాబాలు నిర్వహించడం కష్టమని నిర్వాహకులు అంటున్నారు. దీంతో అధికారులకు మామూళ్లు ఇస్తూ హోటళ్లను కాస్తా బార్లలా మార్చేశారు.

బార్లలోనూ అదే తీరు : జిల్లా వ్యాప్తంగా 18 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. తెల్లవారుజామున 5.30 గంటలకే కౌంటర్లు తెరుస్తారు. అర్ధరాత్రి 12 గంటల దాకా తెరిచి ఉంచుతున్నారు. లాభాలు రావడం లేదన్న సాకు చూపి బార్ల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వీటివైపు అధికారులు కన్నెత్తిచూడలేదు.

ఉదయం 10 గంటలకు తెరవాలి

జిల్లాలో బార్ల యజమానులకు కచ్చితమైన ఆదేశాలు ఇచ్చాం. ఉదయం 10 గంటల తర్వాతే బార్లు తెరవాలన్న నిబంధనను ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ధాబాలు, హోటళ్లలో మద్యం అమ్మడంగాని, తాగేందుకు అనుమతించడం గాని చేయరాదు. అలా ఎవరు చేసినా చర్యలు తీసుకుంటాం. ఇక మా సిబ్బంది మామూళ్లు తీసుకుంటున్నట్లు తెలిస్తే నేరుగా మాదృష్టికి తీసుకురండి. శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– కుమరేశ్వరన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్